# పాపిష్టి జీవితం!

శ్రీ కె. జి. ఆచార్య—"ప్రా. భా. విశారద"

'అమ్మా!...'

'.........'

'అ...మ్మా...!'

'ఊఁ!'

'బువ్వలేకపోతే మానేలే; మంచినీళ్లన్నాయియ్యి!'

'.........'

'అబ్బ!...మాట్లాడవు...! రెండుగుక్కెళ్ళుమంచి నీళ్లియ్యవే! గొంతు కెండిపోతున్నది...!!'

నీళ్ళులేవు నాయనా!... అయిపోయినాయి! వెళ్లి తీసుకొస్తాను పడుకో కళ్ళుమూసుకుని!

'మరి, తొందరగా తీసుకురా!'

★

ఆదినిశీథసమయం. నిశాకన్య తన సహజభీకరసౌందర్య రూపలావణ్యాదులతో సర్వాంగ సుందరిలాగ శోభిల్లుచూ, మౌనంతోనే నవమోహినిలాగ నృత్యం సల్పుతూవుంది. నిశాకన్య సౌందరాన్ని చూడలేనితనంతో, మధ్యమధ్య కీచురాలు మొదలైనవన్నీ కీచఱుపులతోనూ, బిగ్గఱుపులతోనూ దానిని స్తబ్ధతకు భంగంగలుగుజేస్తూన్నాయి.

అంధకారబంధురమైయున్న ఆకుగ్రామానికి చివర కొద్దిగ దూరంగా, సుమా రిరవై గుడిసెలుమాత్రంవున్న ఓ మాలపల్లెవుంది. ఆపల్లె చివరనున్న ఆచిన్నిగుడిసె, శిథిలసంకీర్ణావస్థతోనిండి, పైభాగంమీద పూరిగడ్డిపూర్తిగాలేక, పెద్దపెద్ద బెజ్జాలతో పూర్ణమైయుండడంచేత, మిళుకుమిళుకుమని మెరుస్తూన్న మిన్నుమీది తారలు,—వాటితో తమసామీప్యబాంధవ్యం వున్నట్లు చాటుతూన్న మిణుగురుపురుగులుగూడా— ఆరంధ్రాలగుండా స్పష్టంగా గుడిసెలలోనికి కనబడుతున్నాయి. ఆగుడిసె చుట్టూ చింకిగోనెగుడ్డలతోటీ, ఈతాకులతోటీ కట్టబడి, అక్కడక్కడ పడిపోయిన దడిగూడావుంది. గుడిసె వెనుకభాగంలో బ్రహ్మజెముడు కంచె బ్రహ్మాండంగా వ్యాపించి తన భీభత్సాన్ని జూపిస్తూవుంది. అలాంటి శిథిలమైన గుడిసెల్లో, ఒకఅబల, ఒకబాలుడు—శల్యావశిష్టులైయున్న వారిద్దరే నాటిరాత్రి మేల్కొనియుండి, నాటి గాఢాంధకారముకంటె, తమదీర్ఘదుర్భర దారిద్ర్యాంధకారమే సుస్థిరమయిందో యన్నట్లు వ్యక్తపరుస్తున్నారు! ఆపసికూన చీకిచీకి తూట్లుపడిన ఓ చిన్న నులకమంచంమీద పడుకొని ఆకలిమంటచేత మలమల మాడిపోతూ, మధ్యమధ్య మంచినీళ్ళుఅడుగుతు, కొంత సేపు యేడుస్తూ, మరికొంతసేపు నిస్పృహజెందిపోయి పడుకుంటూ చెప్పశక్యంగాని అవస్థపడుతున్నాడు పాపం!

ఆబాలునితల్లి మంచంప్రక్కనే కూర్చొని కొడుకును సమదాయించుతూ, 'అయ్యో, మంచినీళ్లైన లేకపోయెనే!!' అని మనస్సులో అనుకుంటూ కుమిలిపోతూ దుఃఖిస్తూవుంది!!

★

భర్తచనిపోయి రెండునెలలవుతుంది. అంతకుముందు భార్యాభర్తలిద్దరూ కలిసి కూలికిబోయి, యిద్దరూసంపాదించుకున్న డబ్బులతోనే రోజులు గడుపుకునేవారు. కాని యిప్పుడు వొంటరియైపోవడమేకాకుండా—నిండు చూలాలుగావడంచేత కష్టించి పనిచేయలేకపోతున్నది. అంతేగాక యీనిండుచూలాలుచేత యెవ్వరూ పని చేయించుకొనడంలేదు బాగాచేయలేదని. అందుచేత యిరవై రోజులనుంచి దారిద్ర్యభూతమీయిద్దర్నీ పూర్తిగా నావహించి, పీల్చి పిప్పిచేసేస్తూవుంది. నాలుగైదురోజుల వరకూ—

నీళ్లు మొదలు కూటిగింజలు వరకూ - ప్రతీరోజూ అవసరమయ్యేదంతా - ఆ మాలపల్లెలోనివాళ్ళే, తలో కొస్తాయిస్తావచ్చారు. తర్వాత అడుక్కునప్పటికీగూడా ఒకగం కడుపైనా సరిగా నిండడానికి మెతుకులు దొరికేవిగాదు పాపమా దరిద్రురాలికి ! యెవరెంతకాలం పెడతారు? పెట్టిన రెండు మూడు రోజులు పెట్టుతారేమో! అటు తర్వాత పెట్టక పోవడమే గాకుండా పైగా చీవాట్లు పెట్టుతారు! మరీ రెండు రోజులునుంచి జలవాయువులే వారి కాహారాలయ్యాయి; నాటిరాత్రి ఆనీళ్లుగూడా లేవు పాపం! ఆ మండు వేసవి రోజుల్లో నీళ్లు గూడా భద్రపరచు కోడానికి దరిద్రురాలికి సరియైన కుండ గూడా లేక పోయింది. తన జాతివాళ్లు గదా అని అర్థించినా, ప్రభువులని పైవారిని ప్రార్థించినా, ఆరోజు నాడు మాత్రం ఒక్క అన్నం మెతుకుగూడా లభించలేదు -- ఆఖరికి ఆనాటిరాత్రి నీళ్లు చుక్కలు గూడా లభించలేదా నిర్భాగ్యురాలికి!! ధనమదాంధత్వం చేత మిన్నూ మన్నూ గుర్తించకుండా వుండే స్వార్థ మానవ మాత్రులతో మయమైయున్న నేటి సంఘం, యిలాంటి ఆకటి చిచ్చుచేత అలమటించే అన్నాతురుల్ని - అభాగుల్ని - చూస్తుందా? కలలోనైనా అనుకోవడానికి వీల్లేదు!!

✱

దప్పిక బాధను గూడా ఓర్చుకోలేక 'మంచి నీళ్లు తీసుకురా అమ్మా...?' అని యెండిపోయిన గడ్డి పరక లాగున్న ఆ నాలుకను చప్పరిస్తూ మళ్ళీ అన్నాడా అర్భకుడు!

ఆమె తన ముద్దు బిడ్డడు పడే ఆబాధను యింక చూడలేక పోయింది. మాలపల్లె కంతకూవున్న ఆ ఒక్క నూతిలో, ఆ వేసవి రోజులో మచ్చుకైనా నీళ్ళు లేనందున యింకెక్కువ తేవాలనే సంధిగ్ధావస్థలోపడి యింతవరకూ వూరుకుంది. కాని యిప్పుడేదో తన మనస్సుకు తట్టగా, యెలాగైనా సరే నీళ్లు తీసుకు రావాలని నిశ్చయించుకుంది. తన బాధనుగూడా మరిచి పోయి, యెంతో సాహసంతో, తాటియాకు దొప్ప చేత్తోబట్టుకుని వూరి మధ్యలో రాములువారి దేవాలయం వద్దనున్న నూతి దగ్గరకు వెళ్ళింది ఆ గాఢాంధకారంలోనే! అక్కడే తోడుకొనడానికి బొక్కెనగూడా వుంది. ఎంతో సాహసంతో బొక్కెన బావిలోనికి విడిచింది, అది మంచి తోడుతూండగా త్రాడు తెగి పెద్ద ధ్వనితో బొక్కెన నీళ్ళలో పడిపోయిం దాదరిద్రురాలి దురదృష్టవశాత్తు! ప్రక్కయింటి అరుగుమీదే పడుకొనివున్న సనాతన బ్రాహ్మణుడొకడు వులిక్కిపడి లేచి 'దొంగ!...దొంగ!!' అని అరిచేడు! వెంటనే యెంతో జనం మూగేరు. ఏమీ ఆలోచించకుండానే ఆ నిరపరాధినిని నిస్పృహ జెందేటట్లు కొట్టేరు! ఇంకా తృప్తి బొందక లాంతరువెలుగుతో ఆమెను చూచి మాలదని గ్రహించి, నూతిని, దేవుణ్ణి అపవిత్రంజేసిందని చీంబోతుల్లాగ చిందులు త్రొక్కుతూ మరి రెండు బాదేరు! ఆఖరు కేమాత్రం కనికారమూలేకుండా మాలపల్లెకు యీడ్చేసేరు!!

✱

ఆమెకు వుదయాన్నే తెలివి వచ్చింది. తానుంటే గుడిసె ప్రక్కనే పడివున్నానని తెలుసుకుంది. శరీరం నిండా గాయాలే! ఆ జీర్ణ వస్త్రమంతా రక్తసిక్తమై పోయివుంది! తలమీదనుండి రక్తం యేకధారగా ప్రవహించి ముద్దయై పోయివుంది. నడిరాత్రి జరిగిన దుర్ఘటనంతా వెంటనే స్ఫురణ కొచ్చింది! తన ప్రియపుత్రుడు యెలాగున్నాడో చూడాలనే ఆతురతతోటి యెలాగో మెల్లగ ప్రాకుతూనే గుడిసెలో ప్రవేశించింది. ఆరాత్రే ఆ బాలుడు దారిద్ర్య దేవత కెర యయ్యాడు!! ఆమె తన ముద్దు బిడ్డ మరణించాడని తెలుసుకుంది. భరింపరాని దుఃఖంతో 'ఛీ, పాపిష్టి జీవితం!' అంటూనే వెంటనే కుమారుని మృత కళేబరము పైబడి, కొంత సేపైన తర్వాత పుత్రునితో కలుసుకొన బోయింది!!!

★ గమనిక ★

ప్రతినెలా 5-వ తేదీన వెలువడుతూన్న 'కథాంజలి' యికమీదట ప్రతి నెలా 15-వ తేదీ వెలువడుతుంది.

మేనేజరు, కథాంజలి.